పంట కాలువలకు బుంగలు

- పొలాలకు అందని సాగు నీరు
- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న ఆయకట్టు రైతులు



నర్వ పరిధిలో కొట్టుకుపోయిన పంటకాలువ సిమెంట్ లైనింగ్



బుంగల ద్వారా వృథాగా పోతున్న సాగు నీరు

నిజాంసాగర్(జుక్కల్): పాత చెరువు పంట కాలువల పరిస్థితి దయనీయంగా మారింది. సిమెంట్ లైనింగ్ కొట్టుకుపోయి శిథిలావస్థకు చేరడంతో ఆయకట్టుకు సాగు నీరు అందని ద్రాక్ష అవుతోంది. చెరువు నీటిని తూముల ద్వారా విడుదల చేసినా పంట కాలువలు అధ్వానంగా ఉండటంతో సాగు నీరు వృథాగా పోతోంది. మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామ పాత చెరువు తూములతో పాటు పంట కాలువలపై పాలకులు, ప్రభుత్వ అధికారులు చిన్నచూపుస్తున్నారు. పాత చెరువు కుడి, ఎడమ కాలువలు శిథిలావస్థకు చేరడంతో ఆయకట్టు పంట పొలాలకు సాగు నీరు పారడం లేదు. పాత చెరువు కింద నర్వ, ఎల్లారెడ్డి మండలం అజామాబాద్, అన్నాసాగర్ గ్రామాల పరిధిలో 548 ఎకరాల ఆయకట్టు ఉంది. పంట కాలువల సిమెంట్ సైడ్ వాల్స్ కూలిపోవడంతో పాటు కొన్ని చోట్ల సైడ్ వాల్స్ కొట్టుకుపోయాయి. చెరువు తూముల ద్వారా కుడి, ఎడమ కాలువకు నీటిని విడుదల చేస్తున్నా, పంట కాలువలకు పడ్డ బుంగల కారణంగా సాగు నీరు వృథాగా పోతోంది. దీంతో ఆయకట్టు కింద పంటలు సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట కాలువలపై నిర్లక్ష్యం

గత ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పథకం కింద పాత చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టారు. అయితే ఆ కాంట్రాక్టర్ చెరువు కట్టకు మట్టి, మొరం నింపి తూముల పనులు చేపట్టారు. కుడి, ఎడమ పంట కాలువలకు నాసిరకమైన షట్టర్లు బిగించారు. ఈ కారణంగా ఆయకట్టు ప్రాంత రైతులకు శాపంగా మారింది. వానాకాలంలో కురిసిన వర్షాలకు చెరువు పూర్తిస్థాయిలో నిండినా షట్టర్లు సరిగా తెరుచుకోవడం లేదు.. మూసుకోవడం లేదు. దాంతో చెరువు నీరు పంట పొలాలకు అందకుండా వాగు పాలవుతోంది.

నీరు అందడం లేదు



చెరువు తూములు తెరిచినా కాలువ ద్వారా పంట పొలాలకు నీరు పారడం లేదు. కాలువలు బాగాలేక చెరువు నీరు వాగు పాలవుతుంది. ఆయకట్టు కింద పంట పొలాలు నీళ్ల లేక సాగు నీటికి ఇబ్బందులు తప్పడం లేదు. పంట కాలువలు బాగు చేసిన రైతుల కష్టాలను తీర్చాలి.

– పొట్ల్లోళ్ల పర్వయ్య, రైతు, నర్వ

లైనింగ్ పనులు చేపట్టాలి



చెరువు నిండినా కిందకు సాగు నీరు రావడం లేదు. తూములు ఎత్తి కాలువకు నీళ్లు వదులుతున్నా ఆయకట్టు పంట పొలాలకు నీళ్లు పారడం లేదు. పంట కాలువలకు బుంగలు పడటంతో సాగు నీరు వృథా అవుతుంది. పాత చెరువు పంట కాలువలకు సిమెంట్ లైనింగ్ పనులపై దృష్టి సారించాలి. – శ్రీనివాస్, రైతు, నర్వ

దళారులను నమ్మి మోసపోవద్దు



లింగంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విండో చైర్మన్ గంగాధర్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని పద్మాజీవాడి సింగిల్ విండో చైర్మన్ గంగాధర్ సూచించారు. శుక్రవారం లింగంపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏ–గ్రేడ్ ధాన్యానికి రూ.2320, బీ–గ్రేడ్ ధాన్యానికి రూ.2,300 చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఏవో ప్రజాపతి, మాజీ సర్పంచ్ గుండెల్లి సాయిలు, ఉప సర్పంచ్ దామోదర్ రావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు లింగారావు, తదితరులు పాల్గొన్నారు.

పిట్లం(జుక్కల్): మండలంలోని రాంపూర్, గౌరారం, గౌరారం తండాలలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాలను సహకార సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ శపథంరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈవో సంతోష్ రెడ్డి, సంఘం డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లను కాపాడుకోవాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): చెట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క విద్యార్థిపై ఉందని ప్రధానోపాధ్యాయుడు దామోదర్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఒక చెట్టును మదర్ ట్రీగా ఎంపిక చేసినట్లు తెలిపారు. చెట్ల ప్రాముఖ్యత గురించి వివరించారు. పీడీ హన్మంత్ రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు ప్రదీప్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారిణి ఎస్ఎస్ రత్నం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నాగిరెడ్డిపేట మండల ప్రత్యేకాధికారిణి ఎస్.ఎస్.రత్నం సూచించారు. వదల్‌పర్తి గ్రామాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ఇళ్ల పరిసరాలలో చాలాకాలంగా నిల్వఉన్న నీటిని పారబోయించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడి కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి, పంచాయతీ కార్యదర్శి అజీమోద్దీన్ ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. జిల్లా కేంద్రంలోని బోధనాస్పత్రిలో ఐసీటీసీ కౌన్సెలర్ మ్యాక నాగరాజు హెచ్ఐవీ ఎలా వ్యాపిస్తుంది అనే విషయాల గురించి వివరించారు. హెచ్ఐవి బాధితులను అవమానించొద్దని సూచించారు. హెచ్ఐవీ బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడితే జీవితకాలం పెంచుకోవచ్చని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ శంకర్, వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ బాలకిషన్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద సదుపాయాలు కల్పించాలి



సమావేశం నిర్వహిస్తున్న అధికారి సతీశ్

బీబీపేట: వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని మండల ప్రత్యేకాధికారి సతీశ్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు 8 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయ్యాయని తెలిపారు. రైతులు దళారులను ఎట్టి పరిస్థితుల్లో నమ్మరాదని పేర్కొన్నారు. ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీవో కృష్ణ, ఆర్ఐ అజయ్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై ..



మద్నూర్(జుక్కల్): అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకోవాలని అగ్నిమాపక సిబ్బంది సూచించారు. మండల కేంద్రంలోని న్యూ ఆదర్శ్ విద్యాలయంలో శుక్రవారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీకాంత్, ఉపాధ్యాయులు నాందేవ్, రమ్య, పూజ, హారతి, సుప్రజ, సుజాత, దుర్గా, విద్యార్థులు, అగ్నిమాపక శాఖాధికారులు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో షౌకత్ అలీ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ప్రతి పాఠశాల వివరాలు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని మండల విద్యాధికారి షౌకత్అలీ సూచించారు. శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. పాఠశాలల్లో ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా మూడో శనివారం తప్పనిసరిగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేసి పిల్లల ప్రగతిపై చర్చించాలని సూచించారు. పలు సూచనలు, సలహాలిచ్చారు.

రికవరీ సెల్‌ఫోన్ అప్పగింత



మాచారెడ్డి: పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి శుక్రవారం బాధితునికి అప్పగించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఎల్లంపేట గ్రామానికి చెందిన బూక్య సుభాష్ పోగొట్టుకున్న సెల్ ఫోన్ రికవరీ కోసం ఫిర్యాదు చేయగా వెతికి అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

బీబీపేట: మానవ అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని షీటీం సభ్యులు అన్నారు. శుక్రవా రం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు షీటీం, సైబర్ నేరాలలు, మూఢ నమ్మకాలు, రోడ్డు భద్రత, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా నిర్మూలన, డ్రగ్స్, మత్తు పదార్థాల గురించి అవగాహన కల్పించారు. కళాబృందం సభ్యులు ప్రభాకర్, సాయిలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీస్ ఆఫీసర్ రాజేందర్, పాఠశాల హెచ్ఎంమంగ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు అలవాటు పడొద్దు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): యువకులు డ్రగ్స్‌కు అలవాటు పడవద్దని కళాబృందం సభ్యులు సూచించారు. కళాబృందం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. యువత మత్తుకు అలవాటుపడి గంజాయివంటి మత్తు పదార్థాలను తీసుకుంటున్నారన్నారు. దీంతో మత్తులో ఏం చేస్తున్నారో తెలియక జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పలు అంశాల గురించి వివరించారు. కళాబృందం జిల్లా అధ్యక్షుడు రమేష్‌రావు, ఏఎస్సై సంజీవులు పాల్గొన్నారు.

భూకబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలి



అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న జగన్‌రెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పోచారం ప్రధానకాలువ కట్ట భూమి కబ్జా విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ నాగిరెడ్డిపేట ఇరిగేషన్ కార్యాలయం వద్ద జగన్‌రెడ్డి అనే యువకుడు శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 30 గుంటల కాలువ కట్ట భూమిని కబ్జా చేశాడని జగన్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయమై గతంలో తాను ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయగా ..కబ్జాదారుడిపై అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. అనంతరం ఇరిగేషన్ అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తి మళ్లీ పోచారం కాలువ కట్ట భూమిని కబ్జా చేసుకొని పంటలను సాగు చేస్తున్నారని..ఈ విషయమై కామారెడ్డిలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశానని, అయినా ఇరిగేషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ అక్షయ్‌ను 'సాక్షి' సంప్రదించగా కబ్జా చేసిన వ్యక్తిపై గతంలో కేసు నమోదు చేశామని, ప్రస్తుతం ఆ కేసు కోర్టులో కొనసాగుతుందని చెప్పారు.

ఇందిరమ్మ కమిటీలు అంటే కాంగ్రెస్ కమిటీలు కాదు



వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ కమిటీలు అంటే కాంగ్రెస్ పార్టీ కమిటీలు కాదని తాడ్వాయి మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఇటీవల గ్రామాలలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలు సరైనవి కావని, కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి ఇష్టానుసారంగా కమిటీలను ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ తాడ్వాయి మండల బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీకి వినతి పత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి, ప్రభుత్వ జీవో ప్రకారం ప్రజల సమక్షంలో కమిటీలను వేయాలన్నారు. తాడ్వాయి సింగిల్‌విండో చైర్మన్ కపిల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నర్సింలు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, మహిపాల్ రెడ్డి, రాజుగౌడ్, రాజిరెడ్డి, సంగారావు పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ట్రాన్స్‌కో అధికారులు, రైతులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మోటార్లకు కెపాసిటర్లను బిగించుకోవాలని ఎల్లారెడ్డి డీఈ విజయసారథి, రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన పర్మళ్లలో ఏర్పాటు చేసిన పొలం బాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. లూజు లైన్ తీగలు, వంగిన పోల్స్ పంట చేలల్లో ఉంటే లైన్‌మన్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే రైతులు నేరుగా ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజులు వేసుకోవద్దని, లైన్‌మెన్ ద్వారానే కరెంటు పనులు చేయించుకోవాలని సూచించారు. చిన్న పని కోసం ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దన్నారు. ఏడీఈ మల్లేష్, శెట్పల్లిసంగారెడ్డి ఏఈ హరీష్‌రావు, సబ్‌ఇంజినీర్ అశోక్, లైన్‌మెన్ పండు, రాములు, హైమద్, అమ్రియా పాల్గొన్నారు.

'ఐదు డీఏలను వెంటనే చెల్లించాలి'

పిట్లం(జుక్కల్): ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఐదు డీఏలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఉపాధ్యాయుల సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పిట్లం మండలంలో మార్తాండ, హస్నాపూర్, కంబాపూర్, గోధుమేగాం, కారేగాం, చిన్న కొడపగల్ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి, పాఠశాలలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పిట్లం మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, రాష్ట్ర కౌన్సెలర్ డాక్టర్ నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షుడు టి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సీహెచ్ లింగం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ



పాఠశాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్కూల్ చుట్టు పక్కల ఉన్న పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం పెట్టాలని హెచ్ఎంకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ సుజాత, ఎంఈవో ఎల్లయ్య, కౌన్సిలర్లు చాట్ల వంశీకృష్ణ, పాత శివ కృష్ణమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేశ్

లింగంపేట(ఎల్లారెడ్డి): మోతె, మెంగారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, అంగన్‌వాడి కేంద్రాలను శుక్రవారం ఎంపీడీవో నరేశ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా వండాలని సూచించారు.

క్లుప్తంగా

నాగిరెడ్డిపేట ఏవోగా సాయికిరణ్



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో నాగిరెడ్డిపేట ఏవోగా సాయికిరణ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నాగిరెడ్డిపేటలో ఏవోగా విధులు నిర్వహించిన విజయశేఖర్ ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా నిజామాబాద్‌కు వెళ్లారు. జిల్లాకు నూతన ఏవోలను నియమించటంతో నాగిరెడ్డిపేట ఏవోగా సాయికుమార్ వచ్చారు.

ట్రాన్స్‌కో ఏఈగా గంగాధర్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ మండల ట్రాన్స్‌కో ఏఈగా గంగాధర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సదాశివనగర్ మండల ఏఈగా బాధ్యతలు చేపట్టిన ధర్మారెడ్డి, కామారెడ్డి సర్కిల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

డోంగ్లీ మండల ఏవోగా శివ

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ ఏవోగా శివకుమార్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. డోంగ్లీ మండలం ఏర్పాటు అయిన తర్వాత ప్రభుత్వం మొదటి సారిగా డోంగ్లీకి ఏవోను కేటాయించడంతో మండల వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతులు వ్యవసాయంలో ఏవైనా సూచనల కోసం 9100627446 ఫోన్ నంబరుకు సంప్రదించవచ్చని ఆయన అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం

కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ఉపాధ్యాయులందరు ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని పీఆర్‌టీయూ(తెలంగాణ) అధ్యక్షుడు అంబీర్ మనోహర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన పలువురు ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కల్పించారు. జి.హర్షవర్ధన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపు రాజకీయాలు తగవు



భిక్కనూరు: మండల కేంద్రంలో కొందరు నేతలు బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని, ఇవి తగవని ఆర్‌టీఏ జిల్లా ప్రతినిధి గంగ్ల రవీందర్ హితవు పలికారు. శుక్రవారం ఆయన భిక్కనూరులో మాట్లాడుతూ.. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలి తప్ప ప్రజలకు సేవలు చేసే వారిని బెదిరించడం మంచిది కాదన్నారు. సమావేశంలో యువజన సంఘాల ప్రతినిధులు మానకొండ రాజు, కర్రోళ్ల రాజు, గోసు రమేష్‌లు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, పాఠశాలకు సంబంధించిన అన్ని రికార్డులు పక్కాగా ఉంచాలని సూచించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు జగదీష్, ప్రధాన కార్యదర్శి కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్రీజ్ అయిన డబ్బులు బాధితుల ఖాతాలో జమ

కామారెడ్డి టౌన్: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రిజిస్టర్ అయిన 16 సైబర్ క్రైమ్ కేసులలో ఫ్రీజ్ చేసిన రూ.1,70,779 నగదును జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు బాధితుల ఖాతాలలో జమ చేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎట్టి పరిస్థితులలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, ఓటీపీలను ఎవరికి చెప్పకూడదని, అనుమానాస్పద లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే 1930 లేదా 100 నెంబర్‌లను సంప్రదించాలని సీఐ సూచించారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయాలి

నిజాంసాగర్(జుక్కల్): వెనుకబడిన ప్రాంతమైన జుక్కల్ నియోజకవర్గానికి అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో కూడిన యంగ్ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నాయకుడు ప్రజా పండరి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. స్కూల్‌ను మంజూరు చేసి, జుక్కల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. నాయకులు బొజ్జ అంజయ్య తదితరులున్నారు.

సంక్షిప్తం

కార్తీకమాస ప్రభాతఫేరి భజనలు ప్రారంభం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో శుక్రవారం భక్తులు కార్తీక మాస ప్రభాతఫేరి భజనలు ప్రారంభించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా భజన చేస్తూ ప్రభాతఫేరి నిర్వహిస్తారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ శాఖ వారు కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు హరికిషన్ 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి బాలు, వైద్యులు అశోక్, నిఖిల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ శిబిరం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం దివ్యాంగ విద్యార్థుల కోసం ఎంఈవో దేవిసింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ శిబిరం ఏర్పాటు చేశారు. ఫిజియోథెరపిస్ట్ వి.సారిక 9 మంది దివ్యాంగ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఇంటి వద్ద చేయించే వ్యాయామాలపై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు కమల్ కిషోర్, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో సయ్యద్ సాజీద్అలీ అన్నారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి ఏయే సమస్యలు ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీవో సవితారెడ్డి, ఏపీవో మల్లేష్, గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంటులు, ఫీల్డు అసిస్టెంటులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో కొత్త పనులను గుర్తించండి

ఎల్లారెడ్డిరూరల్: ఉపాధిహామి పథకంలో కొత్త పనులను గుర్తించాలని ఎంపీవో ప్రకాష్ అన్నారు. శుక్రవారం శివాపూర్‌లో ఈజీఎస్ గ్రామసభ నిర్వహించారు. ఏపీవో వినోద్ తదితరులున్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్స్ పంపిణీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం నాగిరెడ్డిపేట మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి ఉచితంగా స్పోర్ట్స్ యూనిఫామ్స్ అందజేశారు. తరగతిలోని 30 మంది విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేసినట్లు ఆయన చెప్పారు. పాఠశాల హెచ్ఎం వెంకట్రాంరెడ్డి, పీఈటీ సబాత్ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు సుధాకర్, ఇమామ్, ఫారూక్, శేఖర్, వివేక్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో అన్నదానం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పెద్ద ఎత్తున అన్నదాన చేపట్టారు. అమ్మవారికి వైభవంగా పూజలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు. అధ్యక్షుడు బాల్‌రాజు, ప్రధానకార్యదర్శి భానుప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.